జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com








# అక్షరాల్లో సంస్కారం..

# అడుగుల్లో అంతర్జాతీయం!

**✻ శ్రీకాకుళం విద్యా చిత్రపటంలో ధ్రువతార 'సంస్కార్ ఇంటర్నేషనల్ స్కూల్' ✻ 11 ఎకరాల పచ్చని ప్రాంగణం.. ✻ కేంబ్రిడ్జ్, సీబీఎస్ఈ మేళవింపుతో మేటి బోధన**

శ్రీకాకుళం, మే 7 (వార్త):

శ్రీకాకుళం విద్యావనంలో సరికొత్త పరిమళం వికసించింది. ఉత్తరాంధ్ర విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ, సంప్రదాయ విలువలు - ఆధునిక సాంకేతికత కలబోతగా 'సంస్కార్ ఇంటర్నేషనల్ స్కూల్' ఆవిర్భవించింది. కేవలం పుస్తకాల్లోని పాఠాలే కాకుండా, సమాజంలో రాణించే సంస్కారాన్ని నేర్పడమే ధ్యేయంగా అడుగులు వేస్తున్న ఈ విద్యాసంస్థ ఇప్పుడు జిల్లాలోనే అతిపెద్ద ఇంటర్నేషనల్ స్కూల్‌గా అవతరించింది.

## వైద్య నిపుణుల దార్శనికత.. విద్యా వికాసానికి అంకితం..

ప్రముఖ వైద్యులు డాక్టర్ డి. హరిప్రసాదరావు, డాక్టర్ ఎ. శివప్రసాద్, డాక్టర్ బి. అన్నాజీరావు, డాక్టర్ పి. మురళీధర్, డాక్టర్ టి. వేణుగోపాలరావు వంటి విశేష అనుభవం కలిగిన నిపుణుల సారథ్యంలో 'సంస్కార్ ఎడ్యుకేషనల్ సొసైటీ' ఈ పాఠశాలను తీర్చిదిద్దింది. విద్యార్థి ఆరోగ్యం, మానసిక వికాసంపై వైద్యులకు ఉండే స్పష్టమైన అవగాహనతో ఇక్కడి విద్యా విధానాన్ని రూపొందించడం విశేషం.

## అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు.. మన చెంతనే..

జాతీయ విద్యా విధానం - 2024కు అనుగుణంగా ఇక్కడ పాఠ్యప్రణాళిక సాగుతోంది. మాంటిస్సోరి శిక్షణతో ప్రీ-ప్రైమరీ స్థాయిలో చిన్నారుల సృజనాత్మకతకు పదును పెట్టేలా 'ప్లే-వే' పద్ధతిలో బోధన, కేంబ్రిడ్జ్ కరికులమ్‌తో ప్రైమరీ స్థాయిలోనే అంతర్జాతీయ స్థాయి విశ్లేషణాత్మక విద్య అందుతుంది. ఇంకా సీబీఎస్ఈ ఫౌండేషన్ కారణంగా 6వ తరగతి నుంచే సీబీఎస్ఈ సిలబస్‌తో పాటు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ వల్ల విద్యార్థులు భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీ పరీక్షలను అలవోకగా ఎదుర్కోగలరు.

## క్రీడలు - శారీరక దృఢత్వం..

పదకొండు ఎకరాల విశాలమైన క్యాంపస్‌లో క్రీడలకు పెద్దపీట వేశారు. క్రికెట్ గ్రౌండ్, ఫుట్‌బాల్ కోర్టులు, బాస్కెట్‌బాల్ కోర్టు. లి ఈత నేర్చుకోవడానికి అత్యాధునిక స్విమ్మింగ్ పూల్. యోగా, ధ్యానం, ఇండోర్ గేమ్స్ ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపునకు అవకాశం ఉంది.

డిజిటల్ విప్లవం - అత్యాధునిక ల్యాబ్‌లు..

నేటి డిజిటల్ యుగానికి అనుగుణంగా పాఠశాల మొత్తం హై-టెక్ వసతులతో నిండి ఉంది. అధునాతన కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, భాషా నైపుణ్యాల కోసం లాంగ్వేజ్ ల్యాబ్‌లు విద్యార్థులకు ప్రయోగాత్మక జ్ఞానాన్ని అందిస్తున్నాయి. ప్రతి తరగతి గదిని ఒక డైనమిక్ లెర్నింగ్ స్పేస్‌గా మార్చారు.

## సురక్షితమైన వసతి.. అమ్మ ఒడి లాంటి హాస్టల్..

దూర ప్రాంతాల విద్యార్థుల కోసం ఇంటిని తలపించే వసతి సౌకర్యం కల్పించారు. 'రెసిడెన్షియల్', 'సెమీ రెసిడెన్షియల్' పద్ధతుల్లో విద్యార్థులకు పౌష్టికాహారం, నిరంతర పర్యవేక్షణ అందుబాటులో ఉంటాయి. 24 గంటల వైద్య సదుపాయం కూడా ఉంది. శ్రీకాకుళం పెద్దపాడులోని ఈనాడు కార్యాలయం ఎదురుగా ఉన్న ఈ అద్భుత విద్యా నిలయంలో అడ్మిషన్ల ప్రక్రియ ఊపందుకుంది.

## వైద్యుల పర్యవేక్షణలో భద్రత..

ప్రతి విద్యార్థి ఆరోగ్య సమాచారాన్ని నిక్షిప్తం చేస్తూ, అత్యవసర సమయాల్లో నిపుణులైన వైద్యులు తక్షణమే స్పందించేలా పాఠశాలలో ప్రత్యేక విభాగం పనిచేస్తోంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు, వైద్యుల దార్శనికత తోడవ్వడం సంస్కార్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రత్యేకత అని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా విద్యా రంగంలో సంస్కార్ ఇంటర్నేషనల్ స్కూల్ ఒక సరికొత్త విప్లవం. అడ్మిషన్లు కావాల్సినవారు 8019669381, 7901201199 సంప్రదించాలని యాజమాన్యం కోరుతోంది.




## మీ బిడ్డను గ్లోబల్ సిటిజన్‌గా చూడాలనుకుంటే..

జిల్లాలో విద్యార్థులను భావి భారత పౌరులుగానే కాకుండా, శారీరక, మానసిక దృఢత్వం కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'సంస్కార్ ఇంటర్నేషనల్ స్కూల్' పనిచేస్తోందని పాఠశాల యాజమాన్యం స్పష్టం చేసింది. ప్రముఖ వైద్యులు మేనేజ్‌మెంట్‌గా వ్యవహరిస్తున్న ఈ పాఠశాలలో, విద్యార్థుల ఎదుగుదలను వైద్యుల కోణంలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యజమానులైన వైద్యులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.



### అనారోగ్య రహిత సమాజం.. విద్యార్థి దశ నుంచే సాధ్యం

ఆరోగ్యకరమైన గుండె, చురుకైన మెదడు విద్యార్థికి అత్యంత అవసరం. కేవలం చదువులోనే కాకుండా, ఆటపాటల ద్వారా విద్యార్థులు శారీరక దృఢత్వాన్ని పొందేలా మా 11 ఎకరాల విశాల ప్రాంగణంలో క్రీడా సదుపాయాలు కల్పించాం. క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని చిన్నతనం నుంచే అలవాటు చేస్తున్నాం.

- డాక్టర్ బుడుమూరు అన్నాజీరావు (కార్డియాలజిస్ట్)

### క్రమశిక్షణే వెన్నెముక

విద్యార్థుల శారీరక ఎదుగుదలలో సరైన భంగిమలు, వ్యాయామం చాలా కీలకం. మా పాఠశాలలో క్రీడలకు ఇచ్చే ప్రాధాన్యత విద్యార్థుల ఎముకల పుష్టికి, కండరాల దృఢత్వానికి తోడ్పడుతుంది. ఒక క్రమపద్ధతిలో సాగే పాఠశాల జీవనం వారిని దృఢమైన వ్యక్తులుగా మారుస్తుంది.

- డాక్టర్ అన్నెపు శివప్రసాద్ (ఆర్థోపెడిషియన్)





### మానసిక వికాసానికి పెద్దపీట

నేటి పోటీ ప్రపంచంలో పిల్లలపై ఒత్తిడి పెరుగుతోంది. అందుకే మా పాఠశాలలో కేవలం బట్టీ పట్టే విధానం కాకుండా, విశ్లేషణాత్మక ఆలోచనలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ఒత్తిడి లేని అభ్యాసన ద్వారా వారి మెదడు చురుగ్గా పనిచేసేలా, సృజనాత్మకత పెంపొందేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

- డాక్టర్ పైల మురళీధరరావు (న్యూరో సర్జన్)

### సంపూర్ణ ఆరోగ్యం.. సంపూర్ణ విద్య

విద్యార్థుల ఆహారపు అలవాట్లు, పరిసరాల పరిశుభ్రతపై మేము ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పాఠశాలలో ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలను బోధిస్తున్నాం. ఆరోగ్యవంతమైన పౌరులే దేశ సంపద.

- డాక్టర్ తమ్మినాన వేణుగోపాల్ (ఫిజిషియన్)





### విలువలతో కూడిన అంతర్జాతీయ విద్య

సంస్కార్ అంటేనే విలువలు. అంతర్జాతీయ స్థాయి పాఠ్యప్రణాళికను అందిస్తూనే, మన దేశ సంస్కృతీ సంప్రదాయాలను పిల్లలకు నేర్పిస్తున్నాం. జిల్లాలోని విద్యార్థులు బయటి నగరాలకు వెళ్లకుండానే, ఇక్కడే అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను పొందాలన్నదే మా సంకల్పం.

- డాక్టర్ దుంపల హరిప్రసాద్ (యూరాలజిస్ట్)














## బూరగాంలో అల్లూరికి నివాళులు



**కంచిలి, మే 7(వార్త):** విప్లవ వీరుడు మన్యం మగధీరుడు బ్రిటిష్ తెల్ల దొరల పట్ల సింహ స్వప్నం అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం కంచిలి మండలం బూరగం గ్రామంలో గురువారం బొట్టా శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామస్తులు నివాళులర్పించారు. బ్రిటిష్ పాలనలో తీవ్ర అణచివేతకు గురైన భారతీయుల పట్ల నిరంతరం పోరాడి తనదైన శైలిలో స్వాతంత్ర పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచిన మహనీయుడు అల్లూరిని ఈ జాతి ఎన్నటికీ మరువలేదని అన్నారు. ఆయన ప్రతి భారతీయుని గుండెలో చిరస్థాయిగా ఉంటారని అన్నారు. ఆయన ఆశయాలు ప్రస్తుత తరానికి ఎంతో ఆవశ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బద్రి నాగేశ్వరరావు సీనియర్ న్యాయవాది మద్దు సర్వేశ్వరరావు బొడ్డు అప్పారావు మద్దు తిరుపతిరావు కప్ప మీనారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్దానంలో ఆధ్యాత్మిక శోభ

### -మాకన్నపల్లిలో వైభవంగా
### శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం







**పలాస, మే 7(వార్త):** ఉద్దానం నేల ఆధ్యాత్మిక శోభతో కాంతులతో ప్రకాశించింది. పలాస మండలం మాకన్నపల్లిలో శ్రీలక్ష్మీ గణపతి దేవాలయం, సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, నవ గ్రహ మండపం, శివాలయ ప్రతిష్ఠా మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

గ్రామమంతా దైవనామస్మరణతో మారుమోగగా భక్తుల రాకతో మాకన్నపల్లి క్షేత్రం తిరుమలను తలపించింది. ప్రత్యేకంగా అలంకరించిన దేవతామూర్తులను ట్రాక్టర్‌పై ప్రతిష్ఠించి నిర్వహించిన తిరువీధి ఉత్సవం భక్తులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లింది. పెద్దమాకన్నపల్లి, మాకన్నపల్లి, చిన్న నీలావతి, పెద్ద నీలావతి గ్రామాల గుండా సాగిన ఊరేగింపులో మహిళలు తలపై పూర్ణకుంభాలతో నడుస్తూ భక్తి గీతాలు ఆలపించారు. యువకులు మేళతాళాలతో శోభాయాత్రను మరింత వైభవంగా మార్చారు. "గణపతి బప్పా మోరియా"... "హర హర మహా దేవ"... "సుబ్రహ్మణ్య స్వామికి జై" అంటూ మారుమోగిన నినా దాలతో ఉద్దానం ప్రాంతం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. గ్రామ వీధులన్నీ పూలతోరణాలు, మామిడి ఆకుల అలంకర ణలతో దివ్య క్షేత్రంలా దర్శనమిచ్చాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ భక్తి భావంతో పాల్గొని ప్రతిష్ఠా మహోత్సవాన్ని జరిపారు. ఆలయానికి చేరుకున్న దేవతా మూర్తులకు వేదపండితులు వేదఘోషల మధ్య శాస్త్రోక్తంగా పూజలు, హోమాలు, యాగాలు నిర్వహించారు. మంత్రోచ్ఛా రణల నడుమ ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక ప్రకంపనలతో మారుమోగింది. ధూప, దీప నైవేద్యాలతో దేవాలయం దివ్య కాంతులను విరజిమ్మింది. ఉద్దానం నలుమూలల నుంచి వేలా దిగా తరలివచ్చిన భక్తులతో మాకన్నపల్లి జనసంద్రంగా మారింది. భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించగా వేలాదిమంది ప్రసాదాన్ని స్వీకరించారు.

సేవా కార్యక్రమాల్లో యువత, గ్రామ పెద్దలు, మహిళలు స్వచ్ఛం దంగా పాల్గొని భక్తి సేవకు కొత్త అర్థం చెప్పారు. గ్రామ ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన ఈ మహో త్సవం ఉద్దానం ప్రాంత చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోనుందని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎట్టకేలకు నెరవేరుతున్న చిరకాల స్వప్నం

### - లొద్దభద్ర పంచాయతీలో రోడ్డు పనులకు శ్రీకారం
### -పీఏసీఎస్ అధ్యక్షుడు వంకల కూర్మారావు



**పలాస, మే 7(వార్త):** లొద్దభద్ర పంచాయతీ పరిధిలోని మాహదేవిపురం, పొత్రియ గ్రామస్తుల దశాబ్దాల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి బాట పట్టిందని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు వంకల కూర్మా రావు అన్నారు. ఆయన స్వగృహములో మాట్లాడుతూ 2014-19 మధ్య గౌతు శివాజీ హయాంలో ఈ రోడ్డు పనులు మంజూరై, గ్రావెల్ పనులు పూర్తయ్యాయి. కానీ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. కేవలం శిలాఫలకాలకే పరిమితమై, ప్రజల కష్టాలను గాలికొదిలేశారని, ప్రజల కష్టాలను గుర్తించిన పలాస నియోజకవర్గ శాసనసభ్యులు గౌతు శిరీష విశేష కృషితో, ఈ రోడ్డు పనుల కోసం రూ. 2 కోట్ల 30 లక్షల భారీ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నేడు పనులు ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందని, ఈ ప్రాజెక్టుకు మోక్షం కలిగించిన మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, పంచాయితీ రాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ కి, నిరంతరం ప్రజల కోసం శ్రమించే మన ఎమ్మెల్యే గౌతు శిరీష లొద్దభద్ర పంచాయతీ గ్రామస్తుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలని తెలిపారు.

#### ప్రజా ప్రభుత్వం - ప్రగతి పథం!

అభివృద్ధి పనుల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరుకుంటున్నామని, ఇలానె తెలుగుదేశం పార్టీ గౌతు కుటుంబం, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు లొద్దభద్ర పంచాయితీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తామని ప్రజలందరికీ తెలియజేస్తున్నానని చెప్పారు.

## ప్రభుత్వ వైఫల్యంతోనే రైతుల ఆత్మహత్యలు

### - వైసీపీ పట్టణ అధ్యక్షుడు శిస్టు గోపి



**పలాస, మే 7(వార్త):** ప్రభుత్వ వైఫల్యమే రాష్ట్రంలో రైతుల ఆత్మ హత్యలు పెరుగుతుం డటం ఆందోళన కలిగి స్తోందని వైఎస్సార్ కాం గ్రెస్ పార్టీ పలాస పట్టణ అధ్యక్షుడు శిస్టు గోపి మండిపడ్డారు. గురువారం పలాసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒకే రోజు ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం ప్రభుత్వ వైఫల్యానికి -నిదర్శనమన్నారు. అనంతపురం జిల్లాలో రాప్తాడు మండలం చాపట్ల గ్రామానికి చెందిన కౌలు రైతు తలారి నరసింహులు, రాయదుర్గం రూరల్ ఉడేగోళం గ్రామానికి చెందిన రైతు తిప్పేస్వామి(32), పామిడ్ మండలం నీలూరు గ్రామానికి చెందిన బెల్లం నాగేంద్రరెడ్డి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలకు పాల్పడడం తీవ్ర విషాదకరమన్నారు. పారిశ్రామికవేత్తలకు వేల కోట్ల రూపాయల రాయితీలు ఇచ్చే ప్రభుత్వం రైతులకు మాత్రం కనీస మద్దతు ధర కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. 99 పైసలకే భూములు ఇస్తామని చెప్పే నాయకులు రైతుల సమస్యలపై స్పందించడం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో వ్యవసాయం దండుగ అన్న వ్యాఖ్యలను గుర్తు చేస్తూ రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కౌలు రైతుల కుటుంబాలకు సాయం చేస్తామని చెప్పి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను మరిచిపోయారని ఆరోపించారు. రైతులు పండించిన ప్రతి పంటకు వెంటనే గిట్టుబాటు ధర కల్పించా లని, రైతు ఆత్మహత్యల బాధిత కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో రైతు ఆత్మహత్యల బాధిత కుటుంబాలకు ఇచ్చిన రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచి అందించాలని డిమాండ్ చేశారు.

## వైభవంగా జలయాత్ర



**ఇచ్ఛాపురం, మే 7(వార్త):** సయ్యద్ ఖాన్ చెరువు గట్టు పై ఉన్న తారకేశ్వర ఆలయంలో అభయ ఆంజనేయ స్వామి విగ్రహన్ని నిర్మించారు. దుక్క తిరుపతి రెడ్డి దంపతులు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా జలయాత్ర నిర్వహించారు. బాహుదా నది నుంచి పవిత్ర జలాన్ని తెచ్చి భక్తులు జలాభిషేకం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# సచివాలయం ఖాళీ!

### - ముఖ్యమంత్రి పర్యటనకు కొందరు
### - జనాభా లెక్కలకు మరికొందరు




**సోంపేట, మే 7(వార్త):** ఈనెల 16న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నరసన్నపేట రానున్న క్రమంలో అక్కడ విధులకు ఎప్పటినుంచే అధికారులకు సిబ్బందికి విధుల్లో నియమించడంతో సోంపేట మేజర్ పంచాయతీ నుంచి ఈవో శాంత కుమార్ తో పాటు పదిమంది శానిటేషన్ సిబ్బంది కూడా నరసన్నపేట వెళ్లాల్సి వచ్చింది. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ తో పాటు మిగతా సిబ్బంది జనాభా లెక్కల సేకరణకు ప్రతిరోజు వెళ్లక తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో సోంపేట పంచాయతీ కార్యాలయం ఖాళీగా మారింది. నిత్యం రద్దీగా ఉండే కార్యాలయంలో వివిధ పనుల కోసం వచ్చే స్థానికులు పనులు జరక్క ఆవేదనతో తిరుగు ముఖం పడుతున్నారు. మే ఐదు నుంచి 16 వరకు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ పరిస్థితి పట్ల స్థానికుల్లో విమర్శలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఏకంగా 10 రోజులు పాటు కార్యాలయ సిబ్బందిని తరలించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితిపై జిల్లా అధికారులు పునరాల్లోచన చేయాలని కోరుతున్నారు.

## మడపాం టోల్ ప్లాజా వద్ద పశువుల అక్రమ రవాణా అడ్డగింత

**నరసన్నపేట, మే 7(వార్త):** మడపాం టోల్ ప్లాజా వద్ద అక్రమంగా పశువులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం కంచిలి ప్రాంతం నుంచి విజయనగరం జిల్లా ఆలమండకు ఆరు పశువులను తరలిస్తుండగా నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుకున్నట్లు ఎస్ఐ బి. గణేశ్ తెలిపారు. అనంతరం వాహనాన్ని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పశువులను నిబంధనలకు విరుద్ధంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ రవాణాలను అరికట్టేందుకు తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.



# పంట నష్టం జరిగినా పట్టించుకోరా?

### -పొలాల్లో రైతులతో కలసి వైసీపీ నేతల నిరసన

**సోంపేట, మే 7(వార్త):** అకాల వర్షాలకు వందలాది ఎకరాల్లో టమాటా పంట నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయినప్పటికీ నెలరోజులు గడిచిన వారిని ఆదుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని వైసిపి ఇచ్ఛాపురం కన్వీనర్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ డాక్టర్ ని మన దాసు, జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ వైసిపి రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ పలువురు రైతులతో కలిసి గురువారం జింక భద్ర గ్రామ సమీపంలో పొలాల్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ లక్షలాది రూపాయలు పంట కోసం పెట్టుబడులు పెట్టి అప్పుల పాలైన రైతన్నలకు అకాల వర్షాలు అప్పుల పాలు చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతన్నకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, మార్కెట్లో దళారీలు పెరిగిపోవడం ఆరుగాలం శ్రమించే రైతులకు అప్పులే మిగులుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించిందని అన్నారు. జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ ఎంపీపీ డాక్టర్ నిమ్మను దాసు మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి ప్రతివారం కోట్లాది రూపాయల అప్పులు చేసుకుంటూ అమరావతిలో కమిషన్లు దండుకోవడమే తప్ప రైతు సంక్షేమం పట్టదని విమర్శించారు. రాష్ట్రంలో రైతు పరిస్థితి ఘోరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో రైతులకు అన్నివేళలా ప్రభుత్వం అండగా ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరు సంతృప్తికరంగా లేరని అన్నారు.ఒక కూటమి నాయకులే తప్ప మిగతా అన్ని వర్గాలు కష్టాలు నష్టాలతో తీవ్ర ఆవేదనతో బతుకులు సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు ఇప్పిలి కృష్ణారావు గుర్రాల శ్రీను సల్ల దేవరాజు పొడుగు కామేష్ తామడ బుజ్జి బతకల మోహన్రావు తామాడ పద్మావతి పిన్నింటి ఈశ్వరరావు పాతిన శేషగిరి రౌతు విశ్వనాథం కర్రి సత్యం మెరుగు తిరుపతిరెడ్డి సారధి చౌదరి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## తడి-పొడి చెత్త నిర్వహణపై అవగాహన

**నరసన్నపేట, మే 7(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని హడ్కో కాలనీలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి నిర్వహించే విధానంపై గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్, పాతపట్నం ఎంపీడీవో హెచ్.వి రమణ ఆధ్వర్యంలోని బృందం హడ్కో కాలనీలో ఇంటింటా ప్రచారం చేపట్టి ప్రజలకు పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. చెత్తను తడి, పొడి విభాగాలుగా వేరు చేసి ఇవ్వడం వల్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని వివరించారు. పారిశుధ్య పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నరసన్నపేటను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొని స్వచ్ఛత కార్యక్రమాలకు సహకారం అందించారు.



# ఘనంగా అల్లూరి వర్ధంతి



### - దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్న మోడీ
### - న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు

**పలాస, మే 7(వార్త):** బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన అల్లూరి అల్లూరి స్ఫూర్తితో సామ్రాజవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాంఅని సిపిఐఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. రవిఅస్తమించని బ్రిటిసామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి సందర్భంగా పలాస మండలం మామిడిపల్లి గ్రామంలో అల్లూరి విగ్రహం వద్ద గురువారం ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ప్రగతిశీల యువజన సంఘం పి వై ఎల్ జిల్లా కన్వీనర్ సారా జగన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాధవరావు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్రం కోసం అల్లూరి సీతారామరాజు విరోచకంగా పోరాడి 1924 మే 7వ తేదీన బ్రిటిష్ వారు చేతులో హత్యకు గురయ్యారు. ఆనాడు బ్రిటీష్ సామ్రాజవాదానికి భారతదేశం వలసగా మారితే నేడు అమెరికన్ సామ్రాజ్యవాదంకి భారత పాలకులు లొంగి పోయారు. ట్రంపు ఏది చెబితే దానికి దేశ ప్రధాని మోదీ తల ఊపుతూ ట్రంప్ కు గులాఎం గిరి చేస్తున్నారని మండిపడ్డారు. దేశ సార్వభౌమత్వాన్ని మోడీ తాకట్టు పెడుతున్నారు. భారతీయ విద్యార్థులకు సంకెళ్లు వేసి తీసుకురావడం అత్యంత దారుణమైనదని, టారిఫ్ల పేరుతో మన దేశం పైన ఇష్టానుసారంగా సుంకలు పెంచి మన ఆర్థిక వ్యవస్థ దెబ్బ తినేటట్లు చేస్తున్నారన్నారు. ఆయిల్ ఏ దేశం నుండి దిగుమతి చేసుకోవాలో ట్రంప్ చెప్తేనే మోడీ చేస్తున్నాడు ఎస్ ఐ ఆర్ పేరుతో లక్షల్లో ఓటర్లను తొలగించి ఎన్నికల్లో అనేక అక్రమాలకు పాల్పడి భారతీయ ఎన్నికల వ్యవస్థను తన జేబు సంస్థగా మార్చుకున్నారని తెలిపారు. రాష్ట్రాల ఫెడరల్ హక్కులను పూర్తిగా దెబ్బతీస్తున్నారని, అమెరికా సామ్రాజ్యవాదం చేస్తున్న యుద్ధాల్లో భారతదేశాన్ని భాగస్వామ్యం చేయడానికి చూస్తున్నారని, ఇరాన్ పై జరుగుతున్న అత్యంత పాసవికమైన దాడిని ఖండించలేకపోవడం అన్యాయమైనని ఆందోళన వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో సామ్రాజవాదానికి వ్యతిరేకంగా మోడీ అమెరికాకు లొంగుబాటుకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ, కార్యవర్గ సభ్యురాలు వంకల డిల్లేశ్వరి, ఏఐకేఎంఎస్ నాయకులు వంకలపాపయ్య, జెడే అప్పయ్య, సార నూకయ్య, పిడిఎం నాయకులు ఎం గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## బురదపేట - జోడూరు మార్గంలో వృద్ధుడి మృతదేహం గుర్తింపు



**సారవకోట, మే 7(వార్త):** బురదపేట - జోడూరు మార్గమధ్యంలో రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం మృతుడు సారవకోట మండలం గోవర్ధనపురం గ్రామానికి చెందిన బలగా చిట్టయ్య (75)గా గుర్తించారు. ఆయన తండ్రి పేరు రామయ్య అని తెలిపారు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా .. చర్యలు తీసుకోవాలి

### -ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు



**సారవకోట, మే 7(వార్త):** సారవకోట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చెరువులు, కాలువలు, చెక్ డ్యాములకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో మోహన్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా పంచాయతీ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని మండలంలోని పలు అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించారు.

## గృహ.. భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

### -ఎంపీపీ అరంగి మురళీధర్

**నరసన్నపేట, మే 7(వార్త):** నరసన్నపేట మండలంలో గత వైసీపీ పాలనలో చేపట్టిన గృహ నిర్మాణాలకు సంబంధించిన భూ సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని నరసన్నపేట ఎంపీపీ అరంగి మురళీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హెల్త్ ఓవర్ భూములకు సంబంధించిన సమస్యలపై రెవెన్యూ అధికారులు సమగ్రంగా పరిశీలించి సరైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీపీ సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో పారదర్శకతతో పాటు ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని మండలంలోని పలు అభివృద్ధి, సంక్షేమ అంశాలపై చర్చించారు.



# విద్యుదాఘాతంతో ఊక లారీ కళాసీ దుర్మరణం



**కొత్తూరు, మే 7(వార్త):** నివగాం గ్రామ సమీపంలో జరిగిన ఒక విషాద ఘటనలో ఊక లారీ కలాసి విద్యుదాఘాతంతో మృతి చెందగా, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే, ఆమదాలవలస మండలం అక్కులపేట గ్రామానికి చెందిన పేదాడ అంజయ్య (45) కలాసిగా పనిచేస్తున్న భారీ లారీ, ఆమదాలవలస నుండి సాయి రంగ రైస్ మిల్లుకు ఊక లోడుతో వచ్చింది. మిల్లు వద్ద డ్రైవర్ లారీని వెనక్కి మళ్లించే క్రమంలో, అక్కడ తక్కువ ఎత్తులో వేలాడుతున్న హైటెన్షన్ విద్యుత్ తీగలు లారీని తాకాయి. ఈ ప్రమాదాన్ని గమనించిన అంజయ్య, ఆ వైర్లను తొలగించాలనే ఉద్దేశంతో లారీ పైకి ఎక్కాడు. కనీసం పాదరక్షలు కూడా లేకుండా లారీపై ఉన్న ఒక పొడవాటి కర్రతో వైర్లను పక్కకు జరపడానికి ప్రయత్నించాడు. అయితే ఆ ప్రయత్నంలో విద్యుత్ ప్రవాహం ఒక్కసారిగా సోకడంతో అంజయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అదే సమయంలో క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ సునా ఈశ్వరరావు కిందకు దిగేందుకు ప్రయత్నించి విద్యుదాఘాతానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో మిల్లు తలుపులు తీసేందుకు వెళ్లిన క్లీనర్ దూరంగా ఉండటంతో తృటిలో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నాడు.

ఈ సమాచారం అందుకున్న కొత్తూరు ఎస్సై కే. వెంకటేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడు అంజయ్యకు భార్య ధనలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ భారమంతా మోస్తున్న యజమాని ఆకస్మిక మరణంతో అక్కులపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మొక్కజొన్న రైతులకు దెబ్బపై దెబ్బ..!

### - ధర లేక వర్షంతో పంట నష్టం



**పోలాకి, మే 7(వార్త):** రబీ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటకు సరైన మద్దతు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు గత మంగళవారం కురిసిన భారీ వర్షాలకు పంట తడిసి ముద్దవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలాకి మండలంలోని తలసముద్రం, మబగాం తదితర గ్రామాల్లో రైతులు విస్తారంగా మొక్కజొన్న సాగు చేశారు. అయితే మార్కెట్లో గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇప్పటికే నష్టాల్లో ఉన్న రైతులకు అకాల వర్షాలు మరింత భారంగా మారాయి. పొలాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న తడవడంతో నాణ్యత దెబ్బతిన్నదని రైతులు వాపోతున్నారు. ఒకవైపు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోగా, మరోవైపు ప్రకృతి విపత్తులు వరుసగా నష్టాలను మిగులుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మొక్కజొన్న సాగుతో తీవ్రంగా నష్టపోయామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మొక్కజొన్నకు గిట్టుబాటు ధర ప్రకటించడంతో పాటు వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

# గురువులే మార్గదర్శకులు

### -ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు




**మందస, మే 7(వార్త):** గురువులే మా మార్గదర్శకులు.. దైవం అంటూ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మందస మండలంలోని కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఈ ఏడాది జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అందరూ కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సిబ్బందిని పాఠశాలలో సత్కరించారు. ఏడాది మొత్తంగా ఉపాధ్యాయులు తమపై ప్రత్యేక శ్రద్ధ పెడుతూ, సెలవు రోజుల్లో దూర ప్రాంత ఉపాధ్యాయులు కూడా పాఠశాలకు వచ్చి చక్కగా విద్యాబుద్ధులు నేర్పుతూ, 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధన దిశగా కృషి చేసినందుకు ఉపాధ్యాయులకు సత్కారం చేసినట్లు పాఠశాల విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ సర్వీస్ మొత్తంలో ఇటువంటి కార్యక్రమం, ఏ పాఠశాలలో కూడా చేపట్టలేదని, ఇటువంటి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన విద్యార్థులకు వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, పాఠశాల పీఎంసీ చైర్మన్ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. సన్మాన కార్యక్రమంలో పీఎంసీ ఛైర్పర్సన్ ప్రతినిధి కోమటి తిరుపతిరావు, ఉపాధ్యాయులు గవ్వ భీమారావు, జి.జానకమ్మ, ఎం.లక్ష్మణ రావు, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, ఎం.చిత్రసేను, జి.సూర్యనారాయణ, బి.రమేష్, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.



## ధనుంజయ కుటుంబానికి సిక్కోలు ఉద్దానం సేవా సమితి సాయం

**మందస, మే 7(వార్త):** మందస మండలంలోని చిన్నబహడపల్లి గ్రామానికి చెందిన ఏడు నెలల చిన్నారి ధనుంజయ లీవర్ వ్యాధితో బాధ పడుతున్నాడు. డాక్టర్స్ లివర్ ట్రాన్స్ ప్లాంట్(కాలేయ మార్పిడి) అవసరం అని చెప్పారు. సుమారు రూ.25లక్షలు వరకు వ్యయం అవుతుందని వైద్యులు చెప్పడంతో డాక్టర్స్ ట్రీట్ మెంట్ కోసం సిక్కోలు ఉద్దానం సేవా సమితి రూ.10వేలు ఆర్థిక సహాయం చిన్నారి ధనుంజయ తల్లితండ్రులు బత్తిని పాపారావు, శ్రావణికి అందజేశారు. ధనుజంయ తల్లిదండ్రులు దినసరి కూలీలు అవ్వడంతో దాతలు సహాయం కోరుతున్నారు. సమాచారం తెలుసుకున్న సిక్కోలు ఉద్దానం సేవా సమితి వెంటనే స్పందించి ఈ సాయాన్ని అందించారు. కార్యక్రమములో సేవా సమితి సభ్యులు తారక్, హరి, రాజశేఖర్, శంకర్, విషు, దిలీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# సీఎం పర్యటన విజయవంతం చేయాలి

### -ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**నరసన్నపేట, మే 7(వార్త):** ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం నరసన్నపేట ఆర్‌డబి బంగ్లాలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం



నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, రహదారుల మరమ్మతులు, విద్యుత్ అలంకరణలు, తాగునీటి సౌకర్యాలు వంటి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఇతర మండలాల నుంచి విధులకు వచ్చే అధికారులకు అవసరమైన వసతులు కల్పించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే వెంటనే స్థానిక నాయకులు లేదా ఎంపీడీవోను సంప్రదించి పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రతిష్టాత్మకంగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన, జిల్లా పరిషత్ సీఈఓతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లిఫ్టులో జారిపడి.. ఉపాధ్యాయుడి మృతి

**శ్రీకాకుళం క్రైం, మే 7 (వార్త):** సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నానుపాత్రుని భుజంగరావు (61) శ్రీకాకుళం నగర పరిధి పీఎన్ కాలనీలో బంధువుల ఇంట్లో వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. డీసీసీబీ కాలనీలో ఉంటున్న బంధువు వెంకట కృష్ణారావు నివాసంలో బుధవారం ఉన్నారు. గురువారం పీఎన్ కాలనీ 9వ లైన్లో సాయిగురు అపార్ట్‌మెంటుకు వెళ్లారు. నాలుగో అంతస్తులో ఉన్న సోదరుడి ఇంట్లో నుంచి కిందకు దిగడానికి భుజంగరావు లిఫ్ట్ వద్దకు చేరారు. బటన్ నొక్కగానే తలుపులు తెరుచుకోవడంతో లోపలికి ప్రవేశించారు. ప్రమాదవశాత్తు అక్కడి నుంచి కిందకు పడిపోయారు. పెద్ద శబ్ధం రావడంతో వాచ్‌మెన్, ఆయన కుటుంబ సభ్యులు హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భుజంగరావు కుమారుడు మహేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు రెండో పట్టణ ఎస్సై చంద్రకళ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

**ఇచ్ఛాపురం, మే 7 (వార్త):** స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని డిసిహెచ్ డాక్టర్ విజయలక్ష్మి తనిఖీ చేశారు. ముందుగా గైనిక్ వార్డులో ప్రవేశించి అక్కడ ఉన్నటువంటి ప్రసవించిన స్త్రీలను ప్రశ్నించి ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పీడియాట్రిక్ వార్డ్ సందర్శించి అక్కడ ఉన్నటువంటి చిన్నపిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి ఆసుపత్రిలో ఉన్న డాక్టర్ సేవల్ని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా డయాలసిస్ యూనిట్ సందర్శించి అక్కడ



ఉన్నటువంటి డయాలసిస్ పేషెంట్ తాలూకా వివరాలు ఇక్కడ డాక్టర్లు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి సంబంధించి ఎటువంటి సమస్యలు ఏమైనా ఉన్నా మెరుగైన సదుపాయాలు కావాలన్నా మా దృష్టిలో పెట్టాలని కోరారు. అలాగే ఎన్ సి డి సెల్ విభాగాన్ని సందర్శించి డాక్టర్ శ్వేత వాణి పండాతో మాట్లాడి స్థానిక రోగుల బాగోగుల కోసం వాళ్ళ ఆరోగ్యం కోసం వాళ్లు సంక్షేమం కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి దేవేందర్ రెడ్డి (హాస్పిటల్ సూపరిండెంట్) డాక్టర్ సనపల అనూష, డాక్టర్ బమ్మిడి గౌతమి, ఎన్ నీలిమ, శానిటరీ విభాగం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజనులపై ఒరిస్సా అధికారులు, పోలీసుల దౌర్జన్యం

### -నిలువరించాలని అధికారులకు

### వినతులు అందించిన గిరిజనులు

**మందస, మే 7(వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్నటువంటి జనగణనలో భాగంగా మందస మండలంలోని సాబకోట పంచాయతీ మాణిక్యపట్నం గ్రామంలో నివసిస్తున్న గిరిజనులపై ఒరిస్సా అధికారులు దాడులను ఖండించి, రక్షణ కల్పించాలని గిరిజన సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో మందస మండల తహసీల్దార్, పోలీసు శాఖ, ఎంపీడీఓ వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం కార్యదర్శి సవర గురునాథ్, రైతు సంఘం మండల కార్యదర్శి పి.దేవేంద్ర మాట్లాడుతూ మందస మండలం సాబకోట పంచాయతీ మాణిక్యపట్టణం గిరిజన గ్రామంలో సుమారుగా 30గిరిజన కుటుంబాలు దశాబ్దాలుగా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం





సాగిస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం మేరకు సాబకోట సచివాలయ సిబ్బంది జన గణన చేసి గోడలపై నెంబర్లు వేశారని, దీనిని ఒరిస్సా అధికారులు ఒరిస్సా పోలీసుల సమక్షంలో ఆంధ్ర అధికారులు వేసినటువంటి నంబర్లను దౌర్జన్యంగా చెరిపి వేసి, ఇండ్లలో ఉన్నటువంటి కుటుంబ సభ్యులపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు. చేయని నేరానికి గిరిజనులను శిక్షించడం ఎంతవరకు సబబు అని వారన్నారు. గతంలో సవర గురునాథ్ పై ఇటువంటి అభియోగమే చేస్తూ ఒరిస్సా పోలీసులు కేసు పెట్టి కోర్టు చుట్టూ తిప్పుతున్నారని, పేద గిరిజనులపై ఇటువంటి తప్పుడు కేసులు పెట్టి కోర్టు చుట్టూ తిప్పడం అన్యాయమన్నారు. అలాగే ఈ గ్రామంలో నివసిస్తున్నటువంటి 30కుటుంబాలు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఓటు కార్డులు ఆంధ్ర పరిధిలోనే ఉన్నాయని, అయినా ఒరిస్సా అధికారులు వచ్చి గిరిజనులపై దాడులు చేయడం, తప్పుడు కేసులు పెట్టడం అన్యాయమన్నారు. దీనిపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. సరిహద్దు గ్రామాలలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, గతంలో కూడా అనేక సార్లు మండల, జిల్లా అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు మట్ట ధర్మారావు, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎస్.భావన్నా, ఎస్.విప్రో, ఎస్.మధుసూదన్, ఎస్.సుదన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మందసలో ఐటీడీఏ పీజీఆర్ఎస్

**మందస, మే 7(వార్త):** మందసలో శుక్రవారం ఐటీడీఏ పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్, మందస ఎంపీడీఓ వై.వెంకటరమణ తెలిపారు. ఉదయం 10 గంటలకు మందస ఎంపీడీవో కార్యాలయంలో గ్రీవెన్స్ ప్రారంభం అవుతుందని తెలిపారు. కార్యక్రమానికి పలాస డివిజన్ స్థాయి అధికారులు, మందస మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని పీవో కోరారు. మందస మండల పరిధిలోగల అన్ని గ్రామాల గిరిజన ప్రజలు హాజరై తమ సమస్యలపై వినతులు సమర్పించుకోవచ్చని పీఓ చెప్పారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**పలాస, మే 7 (వార్త):** రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి తెలిపారు. పలాస మండలం రామకృష్ణాపురం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం గురువారం సంభవించింది. రోడ్డు దాటుతున్న రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ అన్నాబత్తుల వెంకట రమణ(63)ను వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. విశాఖపట్నం నుంచి వస్తున్న బరంపూర్ వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# చింతలరేవు మార్గాన్ని అభివృద్ధి చేసిన సూర



**జలుమూరు, మే 7(వార్త):** శ్రీముఖలింగం సూరావీధికి సంబంధించి వంశధార నదిలోని చింతల రేవు ప్రాంతం అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరకట్ట ఎగువ, దిగువ ప్రాంతాలు ఎత్తుపల్లాలతో ఉండటంతో నదీ స్నానాలకు వెళ్లే భక్తులు, బైకులపై ప్రయాణించే వారు, ముఖ్యంగా వృద్ధులు రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన సోషల్ వర్కర్, రిటైర్డ్ కమ్యూనికేషన్ సీఐ సూర రామసూర్యరావు తన సొంత నిధులతో ముందుకు వచ్చి గ్రావెల్ పోయించి మార్గాన్ని చదును చేయించారు. దీంతో భక్తులు, గ్రామ ప్రజలు సౌకర్యవంతంగా రాకపోకలు సాగించే పరిస్థితి ఏర్పడింది. ప్రజా అవసరాన్ని గుర్తించి స్వచ్ఛందంగా అభివృద్ధి పనులు చేపట్టిన రామసూర్యరావును పలువురు గ్రామస్తులు, గ్రామ పెద్దలు అభినందించారు. ఈ సందర్భంగా 2024 బీఎస్పీ ఎంపీ అభ్యర్థి, శ్రీముఖలింగేశ్వర దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు నాయుడుగారి రాజశేఖర్ ప్రత్యేకంగా అభినందిస్తూ, సమాజ సేవలో ఇలాంటి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు.



## రెండంతస్తుల భవనంపై నుంచి పడి యువకుడి మృతి



**పలాస, మే 7 (వార్త):** కాశీబుగ్గ సమీప చిన్నబాడాంలో విషాద ఘటన చోటుచేసుకుంది. రాత్రి సమయంలో భవనంపై నుంచి ప్రమాదవశుత్తు కిందపడిన కురిటి వినోద్ కుమార్ (33) తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఉదయం స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి మూడేళ్ల కుమారుడు ఉండగా, భార్య ఏడు నెలల గర్భిణి కావడం విషాదాన్ని మరింత పెంచింది. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ

**ఇచ్ఛాపురం, మే 7(వార్త):** ఇచ్ఛాపురంలోని ఏకైక కోదండరామస్వామి దేవాలయంలో నూతన ఉత్సవ విగ్రహ ఆలయ ప్రవేశ, మహాకుంభాభిషేక కార్యక్రమాలు విష్వక్సేన పూజతో ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమ విధానంలో ఈ వేడుకలను గురువారం ప్రారంభించారు. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాలకు చెందిన వైఖానస వేదపండితుల ఆధ్వర్యంలో తొలుత విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, దీక్షాధ్ధారణ, కంకణధారణ కార్యక్రమాలు నిర్వహించారు. కర్తలు పూజలలో పాల్గొని, అకల్మష హోమాలను జరిపించారు. సాయంత్రం పుట్టబంగారం తీసుకువచ్చి, యాగశాల వద్ద శుద్ధి, పూజలను జరిపారు. అనంతరం యాగశాలలో ప్రవేశించి, అగ్నిమథనం ద్వారా అగ్నిజ్వాలలను పుట్టించి, వాటితో హోమగుండాన్ని జ్వలింపజేశారు. వాస్తుధ్వజం, పతాకాఆది హోమాలు, భేరీపూజ, గరుడప్రతిష్ఠ, దిగ్దేవతాబలి ప్రధానం చేశారు. యాగశాలలో నవగ్రహాలు, అష్టదిక్పాలకులు, గరుడాది దేవతామూర్తుల చిత్రపటాలను అలంకరించారు. ఆలయ ధర్మకర్త ప్రత్తి శ్రీలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమాలను ఆలయ అర్చకులు పద్మకుమార్ ఆచార్యులతో పాటు వేదపండితులు పెద్దింటి శ్యామసుందర శ్రీనివాసాచార్యులు, పెదపూడి సూర్యనారాయణాచార్యులు, యేడిద పవన్కుమార్ ఆచార్యులు, పాణింగపల్లి శ్రీనివాసాచార్యులు, సంపర భార్గవాచార్యులు, రాకుదిటి శ్రీనివాసాచార్యులు (వాసుబాబు), శ్రీనివాసుల జనార్ధనాచార్యులు, రామకృష్ణమాచార్యులు, చక్రవర్తుల అనంతాచార్యులు తదితరులు నిర్వహించి, కర్తలను, భక్తులను ఆశీర్వదించారు. కాగా శుక్రవారం అధివాసాలు నిర్వహిస్తామని, పాలు, పెరుగు తీసుకువచ్చి, భక్తులు స్వయంగా పాల్గొనవచ్చునని ధర్మకర్తలు తెలిపారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546